క్లుప్తంగా

ఇంటర్న్‌షిప్‌తో ఉద్యోగావకాశాలు



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రేమకుమారి

మల్కాపురం: ఇంటర్న్‌షిప్స్‌తో నైపుణ్యాలు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయని మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి అన్నారు. కళాశాల ఆవరణలో బుధవారం డిగ్రీ ఫోర్త్ సెమిస్టర్ విద్యార్థినులకు నైపుణ్య ఆధారిత స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్స్ మూల్యాంకన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్‌ల వల్ల విద్యార్థుల్లో ప్రత్యక్ష జ్ఞానం పొంది, విషయ అవగాహన పెరుగుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడి సన్నిధిలో కుంకుమార్చన



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గోకుల్‌నగర్ వినాయక నిలయంలో వరసిద్ధి వినాయక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నిర్వాహకులు నమ్మి వెంకటరావు, లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కామిశెట్టి అప్పలరాజు, కాకి అర్జున్, తోటపల్లి రాజు, అనిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి పీఠం వద్ద లలితా పారాయణం

మల్కాపురం: వినాయక నవరాత్రుల సందర్భంగా మల్కాపురం, పల్లివీధిలోని గణపతి పీఠం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్థానిక మహిళలు బుధవారం సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, గణపతి అష్టోత్తర శత నామావళి, గణపతి స్తోత్రాలు పఠించారు. నిర్వాహకులు భార్గవ సాయిగణేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు రాజు



అక్కిరెడ్డిపాలెం: జాతీయ స్థాయి సివిల్ సర్వీస్ లాన్ టెన్నిస్ పోటీలకు షీలానగర్‌లోని గాజువాక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సబ్ రిజిస్ట్రార్ కె.రాజు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభను కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ లాన్ టెన్నిస్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి మెన్ విభాగంలో తనను ఎంపిక చేసినట్లు తెలియజేశారు.

సమస్యలు విన్నారు.. స్పందించారు



వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, ఆడారి ఆనంద్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

- గోపాలపట్నం తరలివచ్చిన అధికార యంత్రాంగం
- సమస్యలు విన్నవించుకున్న ప్రజానీకం
- సత్వర పరిష్కారానికి కలెక్టర్ ఆదేశం
- సంతృప్తి వ్యక్తం చేసిన అర్జీదారులు

విశాఖ విద్య: గోపాలపట్నం మండల ప్రజానీకం సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు బుధవారం 52వ వార్డు శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఏపీఎంఎస్ఎంఈడీసీ, విశాఖ డైయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. జిల్లా అధికార యంత్రాంగమంతా తరలిరావడంతో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్థానిక అధికారుల సమన్వయంతో కార్యక్రమం విజయవంతానికి తగిన ఏర్పాట్లు చేశారు. గోపాలపట్నం మండల పరిధిలోని వివిధ కాలనీల నుంచి ప్రజానీకం తరలి వచ్చి తమ సమస్యలపై వినతిపత్రాలను నేరుగా కలెక్టర్‌కు అందజేశారు. వాటి సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో ఆయన అక్కడికక్కడే సమీక్షించారు. జిల్లా కార్యాలయాల వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, నేరుగా తమ వద్దకే వచ్చి సమస్యలు ఆలకించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవడంపై అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఇంటి నిర్మాణ బిల్లు ఇప్పించాలి



ప్రభుత్వం మాకు పక్కా ఇల్లు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. కానీ ఆఖరి బిల్లు పెండింగ్ పడింది. బిల్లు మంజూరు చేయాలని చాలా సార్లు అధికారులకు విన్నవించుకున్నాం. కలెక్టర్ మా దగ్గరకు వచ్చినందున సమస్య పరిష్కారం అవుతుందని ఆశ పడుతున్నాం.

– గుడివాడ కుమార్, గోపాలపట్నం

ఉపాధి కల్పించండి



దివ్యాంగుడునైన నాకు జీవనోపాధికి ఇబ్బందిగా ఉంది. పింఛన్ వస్తున్నప్పటికీ, అది సరిపోవడం లేదు. ఏదైనా ఉపాధి లేదా ఉద్యోగం కల్పించాలని గతంలో వికలాంగుల శాఖలో దరఖాస్తు చేసుకున్నాను. అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామన్నారు. జగనన్నకు చెబుదాంలో దరఖాస్తు చేసుకుంటే సమస్య పరిష్కారమవుతుందనే ఆశతో వచ్చాను.

– కోరిబిల్ల నర్సింగరావు, గవరపాలెం

ఇంటి స్థలం కోసం..



నా భర్త విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఇద్దరు పిల్లలు నాపైనే ఆధారపడి ఉన్నారు. సొంతిల్లు లేకపోవడంతో సిద్ధార్థనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాం. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటే, సమస్య పరిష్కారం అవుతుందని చెబితే ఇక్కడికి వచ్చాం.

– లోచర్ల ప్రభావతి, సిద్ధార్థనగర్

కలెక్టర్ తక్షణం స్పందించారు



ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసినా.. బంధువుల వల్ల కలుగుతున్న ఆటంకంతో పనులు ముందుకెళ్లడం లేదు. అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు ఉన్నా.. కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై జగనన్నకు చెబుదాంలో దరఖాస్తు చేసుకున్నా.. కలెక్టర్ వెంటనే స్పందించడం చాలా సంతోషం ఉంది.

– గద్దం భాగ్యలక్ష్మి, మర్రిపాలెం

కాలనీల సమగ్రాభివృద్ధే లక్ష్యం



52వ వార్డులో పర్యటిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్, డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: కాలనీల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డులో బుధవారం ఆయన పర్యటించారు. వార్డులో సమస్యలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతూ, ప్రజానీకం సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వారి వెంట విశాఖ మార్కెట్ చైర్మన్ మాజీ చైర్మన్ బీఎస్.కృష్ణ(అల్ఫా కృష్ణ), వైఎస్సార్ సీపీ నాయకులు జియ్యాని విజయ్ కుమార్, వెంకటేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్‌యాదవ్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పైసా లంచం తీసుకోకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం లబ్ధిదారులకు మాయమాటలు చెప్పి పబ్బం గడిపేదన్నారు. నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని, ప్రజలంతా ఆయనకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్, పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, పెంటరావు, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

మండపాల వద్ద అప్రమత్తంగా ఉండాలి



సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడుతున్న సీఐ బాబు

మల్కాపురం: వినాయక మండపాల వద్ద ఎలాంటి అల్లర్లు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని మల్కాపురం సీఐ జి.డి.బాబు సచివాలయాల మహిళా పోలీసులకు సూచించారు. స్టేషన్ పరిధిలోని సచివాలయాల్లో మహిళా పోలీసులతో బుధవారం సమావేశమైన సీఐ వారికి పలు సూచనలు చేశారు. కొందరు జులాయిలు కావాలని మండపాల వద్దకు వచ్చి చిల్లరగా ప్రవర్తిస్తూ అక్కడి వారిని ఇబ్బందులకు గురి చేస్తుంటారన్నారు. అలాంటి వారిపై తక్షణం తమకు సమాచారం అందించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల నిర్వహణకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించండి



హెచ్‌పీసీఎల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న దాడి సత్యనారాయణ

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ సంస్థ విస్తరణ పనుల్లో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మాజీ డిప్యూటి మేయర్ దాడి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు బుధవారం హెచ్‌పీసీఎల్ సీనియర్ జనరల్ మేనేజర్(పీఆర్‌వో) కాళీ, అధికారులను కలిసి వినతిపత్రం అందజేసి సమస్య వివరించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ సుమారు రెండేళ్ల నుంచి విస్తరణ పనులు జరుగుతున్నాయని, వాటిలో స్థానికేతురులే అధికంగా పనిచేస్తున్నారన్నారు. హెచ్‌పీసీఎల్ సంస్థ కోసం మల్కాపురం చుట్టుపక్కల వాసులు తమ సొంత భూములను ఇచ్చారని, అలాంటి వారిని కాదని ఇతరులకు ఉపాధి కల్పించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. తమ సమస్యను పరిష్కరించాలని, లేకుంటే సంస్థ గేటు బయట ఉదమిస్తామని స్థానిక నిరుద్యోగులు హెచ్చరించారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని సదరు అధికారి హామీ ఇచ్చినట్టు దాడి సత్యనారాయణ తెలిపారు. పెద్దిరెడ్ల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్నార్‌కు ఘన నివాళి



అక్కినేని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: తెలుగు సినిమా రంగానికి స్టెప్పులు నేర్పించిన నటుడు దాదాసాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు అని కళాసేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు కొనియాడారు. గోపాలపట్నంలోని పీఠం కార్యాలయంలో బుధవారం అక్కినేని శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఏఎన్నార్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ చిత్రసీమలో అక్కినేని తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో కళాసేవా పీఠం అధ్యక్షుడు గోరకల రామదాసు, గౌరవ అధ్యక్షుడు కంపర అప్పారావు, మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొంతం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన



అంగన్‌వాడీలో చిన్నారులతో ముచ్చటిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సందర్శించారు. రోజూ ఎంత మంది విద్యార్థులు వస్తున్నారు.. వారికి అందిస్తున్న పౌష్టికాహారం తదితర వసతులపై అంగన్‌వాడీ టీచర్‌తో ఆయన మాట్లాడి ఆరా తీశారు. పౌష్టికాహార నాణ్యతను పరిశీలించారు. కొంతసేపు పిల్లలతో ముచ్చటించి అంగన్‌వాడీ సెంటర్‌లో ఏయే సేవలు అందుతున్నాయని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి వారితో మాట్లాడారు. తమ పిల్లలను నిత్యం అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని సూచించారు. బోధన ఎలా ఉంది, ప్రతి రోజు చిన్నారులకు పోషకాహారం ఇస్తున్నారో లేదో గుర్తించాలన్నారు. పలువురు గర్భిణులు, విద్యార్థుల తల్లులకు ఆనంద్‌కుమార్ పౌష్టికాహారం ప్యాకెట్లు అందించారు.

గణనాయకాయ.. గణ దైవతాయ..



శాంతినగర్‌లో గణపతికి పూజలు చేస్తున్న ఆనంద్ కుమార్, డిప్యూటీ మేయర్ శ్రీధర్



మల్కాపురంలో ఆకట్టుకుంటున్న చంద్రయాన్ సెట్



52వ వార్డు శాంతి నగర్‌లో ఏర్పాటు చేసిన మండపం



కొలువుదీరిన గణనాథుడు

విశాఖ విద్య/మల్కాపురం: గణేశ నవరాత్రి మహోత్సవాలు వాడవాడలా కనులపండువగా జరుగుతున్నాయి. విభిన్న రూపాల్లో కొలువుదీరిన పార్వతీ తనయుడికి విశేష పూజలు చేస్తున్నారు. గణాలకు అధిపతి అయిన స్వామి విఘ్నాలను తొలగించాలని ప్రార్థిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ఎన్ఏడీ కూడలిలోని కాలనీలు, మల్కాపురం తదితర ప్రాంతాల్లో వినూత్న రీతిలో ఏర్పాటు చేసిన మండపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నాయి.

పూజల్లో పాల్గొన్న నాయకులు

ఏపీఎంఎస్ఎంఈడీసీ చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ 52వ వార్డు శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన మండపాన్ని సందర్శించి, వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- 61వ వార్డు మల్కాపురం యాదవ వీధి వద్ద స్థానిక యాదవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో వేణుగోపాలస్వామిగా కొలువుదీరిన గణనాథుడికి వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ పూజలు చేశారు. 63వ వార్డు పార్టీ ఇన్‌చార్జి రాము, ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం పాల్గొన్నారు.
- 61వ వార్డు మల్కాపురం వద్ద ఏర్పాటు చేసిన చంద్రయాన్ సెట్ ఆకట్టుకుంటోంది.



52వ వార్డు కరాసలో దేవేరులతో కొలువుదీరిన విష్ణుమూర్తిగా..

ఆకట్టుకుంటున్న 'ఘన'పతి

గోపాలపట్నం: కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన 63 అడుగుల గణనాథుడి విగ్రహం ఆకట్టుకుంటోంది. స్థానికులు స్వామిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు.

– నరవ బెహరా విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన వినాయ విగ్రహానికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిమజ్జనం చేశారు. పూజల్లో విద్యా సంస్థల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య పాల్గొన్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ప్రారంభించారు.

- కొత్తపాలెంలో స్థానిక యువకులు ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడు రైతు బజారులో రైతుగా దర్శనమిస్తున్నాడు. చుట్టూ ఉన్న కాయగూరల మధ్య తక్కెడ పట్టుకుని ఆర్గానిక్ కాయగూరలే విక్రయిస్తామని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన విగ్రహం ఆకట్టుకుంటోంది.



యాదవ వీధిలో గణపతి పూజల్లో పాల్గొన్న బద్రీనాథ్



90వ వార్డు ఏపీఎస్ఈబీ సెంటర్‌లో ఆకట్టుకుంటున్న సెట్



బెహరా కళాశాల ప్రాంగణంలో గణపతి వద్ద బెహరా విజయచైతన్య, కళాశాల సిబ్బంది



కొత్తపాలెంలో 63 అడుగుల 'ఘన'నాథుడు



ఆర్గానిక్ కూరగాయలు విక్రయించే రైతుగా..

సాఫీగా.. సురక్షితంగా..

- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుల చర్యలు
- బీఆర్‌టీఎస్ రహదారుల్లో వాహనాల వేగానికి కళ్లెం
- స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్, స్టాపర్ల ఏర్పాటు



స్పీడ్ బ్రేకర్లను పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

మర్రిపాలెం: ప్రయాణికులు, వాహన చోదకులు సాఫీగా.. సురక్షితంగా గమ్యాలకు చేరుకోవడానికి కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు.. వాహనాల మితిమీరిన వేగానికి కళ్లెం వేసేందుకు అనేక చర్యలు చేపడుతున్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో వాటిని నివారించేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్ లైన్లు, స్టాపర్లు ఏర్పాటు చేశారు.

'యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా'ల గుర్తింపు

కంచరపాలెం మెట్టు నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకు ఉన్న కూడళ్లలో 'యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా'లను కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. కరాస జంక్షన్ నుంచి మర్రిపాలెం దుర్గాలమ్మ గుడి, మర్రిపాలెం నుంచి 104 ఏరియా జ్యోతినగర్ వద్ద, కంచరపాలెం జంక్షన్ నుంచి రైతుబజారు వద్ద ఉన్న దుర్గానగర్ కూడలి వద్ద ప్రమాద స్థలాలను గుర్తించి జీవీఎంసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వారి సహాయంతో మొత్తం 45 స్పీడ్ బ్రేకర్లను అమర్చారు. ప్రమాదాల నియంత్రణలో భాగంగా వైట్ పెయింట్‌తో పెడెస్ట్రియన్ క్రాసింగ్ లైన్స్, క్యాటైస్, రోడ్డు డివైడింగ్ కంటిన్యుయేషన్ లైన్స్, రోడ్డు షోల్డర్ లైన్స్ తదితర వంటివి ఏర్పాటు చేశారు.

మధ్య రోడ్డులో ప్రయాణం.. ప్రమాదకరం

బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో కార్లు, బైకులు, ఆటోలకు అనుమతి లేదని నో ఎంట్రీ ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ రూల్స్ అధిగమిస్తూ వెళ్తే జరిమానాలు విధిస్తామని వాటిపై ఉంచారు. మధ్య మార్గంలో కేవలం బస్సులు, అంబులెన్సులు మాత్రమే ప్రయాణించాలని, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తే ప్రమాదాల బారిన పడుతున్నారనే విషయమై ట్రాఫిక్ పోలీసులు ఇటువంటి కఠిన చర్యలు చేపట్టారు. ఒకవేళ నిబంధనలు మీరి ఏ వాహనదారుడైనా మధ్య రోడ్డులో ప్రయాణిస్తే ట్రాఫిక్ డిసాబిడియన్స్ రూల్ కింద రూ.535, రూ.1,035 జరిమానాలు విధిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఐదేళ్లలో ప్రమాదాలు ఎక్కువగా జరిగిన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో చర్యలు చేపట్టామని చెబుతున్నారు. గతంలో జరిగిన ప్రమాదాలను హెచ్చరిస్తూ స్టాపర్లను కూడా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అధికారులు ఏడీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ రాజీవ్‌కుమార్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

లభించని బాలుడి ఆచూకీ

పెదగంట్యాడ: యారాడ తీరంలో సోమవారంగల్లంతైన కల్యాణ్ కుమార్(16) ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారంనుంచి కోస్టుగార్డు,నేవీ సిబ్బంది సముద్రంలో డ్రోన్ కెమెరాలతో గాలించినా ఫలితం లేకపోయిందని న్యూపోర్టు పోలీసులు తెలిపారు.